క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులకు రేపు ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు: నగరంలోని వివిధ విద్యా సంస్థల్లో పదో తరగతి చదివి స్టేట్ సిలబస్‌లో 550 మార్కులకుపైగా, ఐసీఎస్‌ఈ సిలబస్‌లో 450కిపైగా మార్కులు వచ్చిన విద్యార్థులను మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ స్థానిక కాపు కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలతో సత్కరించనున్నట్లు మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు వారి గుర్తింపు కార్డు (ఆధార్‌కార్డు/స్కూల్ ఐడీ కార్డు), పదో తరగతి పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకురావాలన్నారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్, జ్ఞాపిక, నగదు బహుమతి అందిస్తామన్నారు. హాజరయ్యే విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 89781 80847, 93476 26288 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దోస్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

ఒంగోలు టౌన్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో దోస్తి ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని శ్రీరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ అన్నారు. నగరంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద ఎస్ఎంఎస్ ఫ్రూట్స్ ఆవరణలో దోస్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో పాదచారులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణతో పాటు బీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బక్కమంతుల వినయ్‌కుమార్, ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, కవులు మొగిలి దేవ, కుర్రా ప్రసాద్‌బాబు, అల్లాబక్షు, ఇస్మాయిల్, కరీమ్, తన్నీరు సురేష్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ కార్యాలయం ప్రారంభం

ఒంగోలు టౌన్: నగరంలోని అన్నవరప్పాడులో కాకుమాని హాస్పిటల్ సమీపంలో బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కార్యాలయాన్ని ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి పి.సురేంద్రరెడ్డి ఆదివారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం, ఉత్తర నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కుళాయి కల.. నెరవేరిన వేళ..!

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు
- ఆలూరు గ్రామానికి రూ.31.5 లక్షలు మంజూరు
- 436 కుళాయిల ఏర్పాటుకు వేగంగా పైప్‌లైన్ పనులు
- త్వరలో బాలినేని చేతుల మీదుగా ప్రారంభం
- నెరవేరిన ఎన్నికల హామీ



పనులను పరిశీలిస్తున్న అధికారులు, కాంట్రాక్టర్

ఆలూరు (కొత్తపట్నం): ఏళ్ల తరబడి ప్రజలను పట్టి పీడిస్తున్న తాగునీటి సమస్యను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పరిష్కరించారు. గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ కావాలని ప్రజలు కోరడంతో.. నెరవేరుస్తానని బాలినేని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో కుళాయి హామీ నెరవేర్చడంపై బాలినేని దృష్టి సారించారు. ఇప్పటికే గాదెపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆలూరు సర్పంచ్ పూనూరి మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వాతి ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పనులు వేగంగా చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్లకు ఇరువైపులా పైప్‌లైన్లు వేస్తున్నారు. ఇళ్లలో కుళాయిలు బిగిస్తున్నారు. లబ్ధిదారుడు ఒక రూపాయి ఖర్చు పెట్టుకోకుండా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. తమకు తెలిసిన దగ్గర నుంచి ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా ఎవ్వరూ ఈ విధంగా ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేయలేదని, ఇదే మొదటిసారిగా చూస్తున్నామని లబ్ధిదారులంతా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఆలూరు గ్రామానికి 436 కుళాయిలు...

జలజీవన్ మిషన్ ద్వారా ఆలూరు గ్రామానికి రూ.31.5 లక్షలు మంజూరు చేసి 436 కుళాయిల ఏర్పాటు కోసం రోడ్డుకు ఇరువైపులా పైపులైన్లు వేస్తున్నారు. ప్రతి ఇంటికి రోజూ 55 లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. మండలంలోని రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు గ్రామాల్లో పైపులైన్లు వేసి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు మెటీరియల్ సిద్ధం చేసుకుంటున్నారు. ఇంటింటికి కుళాయిల ఏర్పాటుతో మహిళలు వీధి పంపుల వద్దకు వెళ్లి వేచి ఉండి నీరు మోసుకొచ్చుకునే పని తప్పనుండటంతో ఎమ్మెల్యే బాలినేనికి పనితీరును మెచ్చుకుంటున్నారు. రెండు నెలల్లో మిగతా గ్రామ పంచాయతీల్లో కూడా పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఆలూరులో ఇంటింటికి కుళాయి ఏర్పాటుకు జరుగుతున్న పనులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో ఉన్న తులసి ఫెర్రస్.. ప్రస్తుతం వైష్ణవి స్పైసెస్ ఎల్ఎల్‌పీ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టుపై కేసు నమోదైంది. వైష్ణవి స్పైసెస్ యజమానులు లీలా మాధవి, అశోక్‌రెడ్డి గ్రోత్‌సెంటర్‌లోని తమ కంపెనీలో ఇనుము అమ్మకానికి పెట్టారు. సంతనూతలపాడు గ్రామానికి చెందిన రంపతోటి అంకారావు ఇనుము మొత్తం కొనుగోలు చేయడానికి వారితో అగ్రిమెంట్ కుదుర్చుకుని కోటీ 26 లక్షల రూపాయలకు పాడుకున్నారు. రూ.26 లక్షలు ముందుగా చెల్లించి మిగిలిన రూ.కోటి నెల రోజుల్లోపు చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ సంవత్సరం జనవరి 14వ తేదీ ఫ్యాక్టరీలో ఐరన్ లోడు చేసుకోవడానికి అంకారావు వెళ్లగా, లీలామాధవి భర్త అశోక్‌రెడ్డి మొత్తం డబ్బు ఇవ్వలేదని, గడువు దాటిపోయిందని కులం పేరుతో బూతులు తిడుతూ అనుచరులతో తనను తోసివేశాడని, తనతో వచ్చిన వారిని కూడా కులం పేరుతో తిట్టి ఫ్యాక్టరీ బయటకు గెంటివేశాడని శనివారం సాయంత్రం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో అంకారావు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్.. ఫ్యాక్టరీ యజమాని లీలామాధవి, అశోక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

31 నుంచి గంగమ్మతల్లి సంబరాలు



గంగమ్మతల్లి మూలవిరాట్

వేటపాలెం: స్థానిక పాకనాటి వీధిలో వేంచేసియున్న గంగమ్మ తల్లి సంబరాలు ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. 31న పోలేరమ్మ అమ్మవారికి సద్ది, నైవేద్యాలు చెల్లింపులు, జూన్ 1న ఉదయం మహాలక్ష్మీ అమ్మవారికి వడపప్పు, పానకాలు చెల్లింపు, 2న గంగమ్మ తల్లి ఊరేగింపు, వీరదాళ్ల సేవ కార్యక్రమతో సంబరాలు ముగుస్తాయని చెప్పారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

చీమకుర్తి: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ పోటీల్లో రాణించిన 8 మంది క్రీడాకారులకు చీమకుర్తి పద్మశాలీయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో ప్రతిభా పురస్కారాలు అందించారు. 600 మార్కులకుగానూ 500కుపైగా సాధించిన పద్మశాలీయులకు చెందిన 24 మంది విద్యార్థులకు ఈ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ జీ రాధాకృష్ణమూర్తి, హెచ్ఎం అవ్వారు వెంకట సుబ్బారావు, 6, 8 వార్డుల కౌన్సిలర్లు గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్ర, సోమా శేషాద్రి, సిరందాస్ మోహన్ దాస్ గాంధీ, అవ్వారు ఆదినారాయణ, సోమా యానాదిశెట్టి, స్థానికులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో సత్యమాంబదేవి



మార్కాపురం టౌన్: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



తాళ్లూరు: ముస్తాబైన అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పదహారు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ.12,715 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పీ శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న పుట్ట, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడిపై దాడి



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గోపిని పరామర్శిస్తున్న దళిత నాయకులు

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఒంగోలు నగర అధ్యక్షుడు పసుమర్తి గోపి, అతడి సోదరుడిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలు సమీపంలోని వల్లూరమ్మ గుడి వద్ద జరుగుతున్న ఒక వేడుకకు సోదరుడితో కలిసి గోపి హాజరయ్యారు. అక్కడ ఫంక్షన్లో గోపికి ముఖ పరిచయమున్న వెల్లంపల్లికి చెందిన సుందర్ కలిశాడు. అతడు దురుసుగా ప్రవర్తించడంతో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగింది. గోపి అక్కడి నుంచి తిరిగి వచ్చేశారు. కారులో అనుసరించిన సుందర్.. అన్నవరప్పాడు రైల్వే ట్రాక్ సమీపంలో అనుచరులతో కలిసి గోపి మీద రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో గోపితో పాటు ఆయన సోదరుడు కమల్ తలకు గాయాలయ్యాయి. తల నుంచి రక్తస్రావం అవుతుండటంతో వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స చేస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన మాదిగ, ఐక్యవేదిక నాయకుడు పత్రా బంగారం పరామర్శించారు. పసుమర్తి గోపిపై దాడిచేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన అంకమ్మతల్లి కొలుపులు



నగరోత్సవంలో అంకమ్మతల్లి



పాల్గొన్న భక్తులు

మోటుమాల (కొత్తపట్నం): మోటుమాల గ్రామంలోని శ్రీ పద్మాల అంకమ్మతల్లి కొలుపులు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 22న ప్రారంభమైన కొలుపుల్లో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పాల్గొని అంకమ్మతల్లి ఆలయంలో టెంకాయలు కొట్టి పూజలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రేన్ సహాయంతో ప్రణీత్‌రెడ్డికి గజమాల వేసి సత్కరించారు. అంకమ్మతల్లిని అలంకరించి ఏనుగు వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్, కోళ్లఫాం, రాములవారి గుడి, గుండమాల బజారు మీదుగా అమ్మవారిని మేళ తాళాలతో ఊరేగించారు. అమ్మవారి ముందు బిందెలతో నీరు పోసి టెంకాయలు, అరటికాయలు సమర్పించి భక్తులు హారతులిచ్చారు. ఆదివారం అమ్మవారి ముందు మొక్కుబడి వేటలను బలిచ్చారు. అమ్మవారికి మొక్కుబడి పొంగళ్లు సమర్పించారు. అమ్మవారికి దేవత పట్టణాలు దీనా బండారంతో కొలుపులకు ముగింపు పలికారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి, ఎంపీటీసీ సభ్యుడు పురిణి వెంకట్రావు, వెంకారెడ్డి, పురిణి వెంకటేశ్వర్లు, చినిగే బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులను మాన్యువల్‌గా చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో సంఘ సభ్యులు

ఒంగోలు: ఉపాధ్యాయుల పదోన్నతులను మాన్యువల్‌గా చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్ డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం భవనం వద్ద ఆదివారం కొద్దిసేపు ఆందోళన చేశారు. అన్ని రకాల పదోన్నతులు మాన్యువల్‌గా చేపడతామని హామీ ఇచ్చి నేడు ఆన్‌లైన్‌లో నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ దద్దాల శ్రీనివాసులు, కో చైర్మన్ ఎస్.రవి, సీనియర్ నాయకులు యర్రయ్య, కో చైర్మన్ అశోక్‌కుమార్, ఎస్ఎండీ రఫీ, పత్రె వెంకట్రావు, పీవీ సుబ్బారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడిని బయటకు తీస్తున్న 108 సిబ్బంది

మార్టూరు: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం ఉదయం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. బల్లికురవ 108 సిబ్బంది సురేష్ వివరాల మేరకు.. గుంటూరు సమీపంలోని వెంగళాయపాలేనికి చెందిన చర్చి పాస్టర్ ఆర్ ప్రసాదరావు తమ సంఘ సభ్యులతో నెల్లూరులో జరుగుతున్న ప్రార్థనా కూటముల కోసం వెళ్లి శనివారం అర్ధరాత్రి గుంటూరుకు వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో వీరి వాహనం రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టడంతో ప్రసాదరావు తీవ్ర గాయాలతో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెనుక ఉన్న మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడగా టోల్ ప్లాజా సిబ్బంది అతి కష్టంతో ప్రసాదరావును వాహనం నుంచి బయటకు తీశారు. క్షతగాత్రులను చిలకలూరి పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాళ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు దశాబ్దాల క్రితం ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. నాడు తమ అభ్యున్నతికి పాటుపడిన గురువుల సేవలు గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు డి.వెంకటేశ్వరరెడ్డి, మాస్టర్లు వీవీ రమణయ్య, ఎం.సుబ్బారావు, ఎస్.అంజిరెడ్డి, వి.ఆంజనేయులు, ఏవీ సుబ్బారావు, బి.కోటిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఆయా బ్యాచ్‌లో నాటి విద్యార్థులు సీహెచ్ నాగేశ్వరరావు, కోటిరెడ్డి, ఎస్.కొండారెడ్డి, రమణమ్మ, వెంకటేశ్వరరెడ్డి, పరదేశి, ఎస్.కొండ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం): మండలంలోని దొనకొండ హైస్కూల్ 2004-2005వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా గతంలో వారితో చదువుకున్న స్నేహితుల జీవితంలోని విశేషాలు గురించి ఒకరినొకరు తెలుసుకుని ఆనందపడ్డారు. వెనుకటి రోజుల జ్ఞాపకాలు గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు గాదం పుల్లారెడ్డి, భాస్కర్, నాగలక్ష్మి, రంగరత్నం, సత్యం నారాయణ పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థులకు మద్యపానం రుగ్మతలపై శిక్షణ

ఒంగోలు టౌన్: నిరంతర వైద్య విద్యలో భాగంగా ఒంగోలు రిమ్స్ కళాశాలలో మద్యపానం–సంబంధిత రుగ్మతలు అనే అంశం మీద ఆదివారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన ఈ శిక్షణకు రాష్ట్రంలోని 9 మెడికల్ కళాశాలకు చెందిన సైక్రియాట్రి పోస్ట్ గ్రాడ్యుయేట్స్, ఫ్యాకల్టీలు హాజరయ్యారు. మొత్తం 80 మంది వరకు శిక్షణ పొందారు. మానసిక విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఆదిశేషమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ ఐ.లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.ప్రసాద్, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ సాగర్, డాక్టర్ నవ్య పర్యవేక్షించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాల్మన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, కో ఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఫణి భూషణ్, డాక్టర్ కోట సురేష్, డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఓలకు పదోన్నతులు

అడహక్ పద్ధతిలో ఎంపీడీఓలుగా నియామకం

నెల్లూరు (పొగతోట): పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి వివిధ మండలాల్లో పరిపాలనాధికారులుగా, ఈఓపీఆర్డీలుగా పనిచేస్తున్న వారికి అడహక్ పద్ధతిలో ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఓలకు సంబంధించి ఎస్.జగదీష్‌ను నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లాకు, డీవీ నరసింహారావును తిరుపతికి, కె.షాలెట్‌ను తిరుపతికి, పి.ప్రసన్నకుమారి, వైవీ నాగేశ్వరప్రసాద్‌ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఈఓపీఆర్డీలకు సంబంధించి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న ఏవీ కృష్ణామోహన్ రావు, రంగసుబ్బారాయుడును నెల్లూరుకు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును నెల్లూరుకు, నెల్లూరులో పనిచేస్తున్న ఎస్.వసుంధర, బి.కల్పన, శ్రీనివాసులురెడ్డి, జలజాక్షిని ప్రకాశం జిల్లాకు బదిలీలు చేశారు.

నాటిక పోటీలకు విశేష స్పందన



కమనీయం నాటికలో సన్నివేశం

పర్చూరు (చినగంజాం): జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నాటక పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించడంతో పాటు విశేష స్పందన వ్యక్తమవుతోంది. రెండో రోజు పోటీలను తిలకించేందుకు కళాకారులు, కళాభిమానులు భారీగా తరలివస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులచే జ్యోతి ప్రజ్వలన, నటరాజ పూజల అనంతరం నాటిక పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. న్యూ స్టార్ మోడరన్ ఆర్ట్స్ విజయవాడ వారి కపిరాజు నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రామలక్ష్మణుల గర్వం, అహంకారాన్ని వీడి భగవంతుల య్యారని రామాయణం, మహాభారతాలు చెబుతున్నాయి. అహంకారం మనిషిని పతనావస్థకు చేరుస్తుంది. అహంకారం గర్వం వల్ల మనిషి ఎంత నష్టపోతాడో తెలిపే కపిరాజు నాటిక వృత్తాంతం. అనంతరం సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం నాటిక కళా సంపదకు నిలువుటద్దం. సినీ, నాటక రంగాల్లో కాలక్రమేణా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్ని మార్పులు వచ్చినా నాటికలు,నాటకాలను చూసేందుకు ప్రేక్షకులు రంగస్థలం వద్దకు తప్పక రావాలన్న ఇతివృత్తంతో ఈనాటిక సాగింది. తదనంతరం ప్రదర్శించిన ఆలీతో సరదాగా, నాన్నా నేనెళ్ళొస్తా నాటికలు కూడ ప్రేక్షకులను మరింత ఆనందింపజేశాయని నిర్వాహకులు చిట్టినేని సాయిబాబు,.కోలా శ్రీనివాసరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గోరంట్ల రాంబాబు, యార్లగడ్డ రామకృష్ణలు తెలిపారు.